క్లుప్తంగా

సంగమేశ్వరంలో భక్తుల పూజలు


వేపదారు శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: వేసవిసెలవులు ప్రారంభం కావడంతో మండలంలోని సప్తనది సంగమ తీరంలో వెలసిన సంగమేశ్వరాలయానికి భక్తుల తాకిడి అధికమవుతుంది. ఆదివారం సంగమేశ్వరాలయాన్ని అధిక సంఖ్యంలో భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆలయంలోని వేపదారు శివలింగానికి రుద్రాభిషేకం, నదీ జలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా సప్తనదుల సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరించి, ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో సోమవారం నుంచి శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వరస్వామి సహిత సుంకులాపరమేశ్వరి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం పూజలు, సాయంత్రం 3 గంటల నుంచి విగ్రహాల గ్రామోత్సవం నిర్వహిస్తాన్నారు. మంగళవారం ఉదయం విగ్రహాలకు అభిషేకం, సాయంత్రం ధాన్యాధివాసం, బుధవారం స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి హస్త నక్షత్ర వృషభ లగ్న శుభపుష్కరాంశమందు ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహముల ప్రతిష్ఠ జరుగునని తెలిపారు. భక్తులు తరలి వచ్చి కార్యక్రమములో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోని, అన్నదానము స్వీకరించాలని కోరారు.

పుస్తక పఠనం మంచి అలవాటు



పుస్తకపఠనం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పుస్తకాలు చదవడం మంచి అలవాటని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే వివిధ రకాల పుస్తకాల పఠనం చేయించారు. ఆమె మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా భవిష్యత్తుకు మంచి మార్గాలను ఏర్పరచుకోవచ్చన్నారు.

కేసీ కెనాల్‌పై వంతెన నిర్మించాలి

పాములపాడు: మండలంలోని కోల్స్‌నం దాపురం గ్రామానికి అనుసంధానంగా ఉన్న కేసీ కెనాల్‌పై వంతెన నిర్మాణం చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు కోరారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి కేసీ కెనాల్‌లో అసంపూర్తిగా ఉన్న వంతెన వద్ద గొంతుకు తాడు బిగించుకొని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ వంతెనపై అప్పట్లో నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయన్నారు. వాటి స్థానంలో 2009లో నూతన వంతెన నిర్మాణం ప్రారంభించారని,. అయితే ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దినకర్, ప్రవీణ్, ఏలియజర్, రత్నమయ్య, చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదె

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివనాయక్ అనే రైతుకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో గేదెలు మృత్యువాత పడ్డాయి. వేంపెంట మజరా గ్రామం గుండాలనట్లు గ్రామానికి చెందిన రైతు ఏసేపుకు చెందిన ఈ గేదెలను మేపేందుకు పొలానికి తీసుకెళ్లగా ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అక్కడే పంచనామా నిర్వహించారు. వీటి విలువ దాదాపు రూ.1.20లక్షలు ఉంటుందని తెలిపారు.

సారా తయారు చేస్తే కేసులు

నందికొట్కూరు: నాటుసారా తయారుచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని నీలిశికారిపేటలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా వందలీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీకి పాల్పడిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో ఎస్ఐ ఎన్వీ రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలే జీవాలకు రక్ష

- ఎండలతీవ్రతతో వడదెబ్బ బారినపడే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోకపోతే మృత్యువాత
- పశువులకు నీటిని ఎక్కువగా తాపిస్తూ.. పచ్చిగడ్డిని మేతగా వేయాలి
- వెటర్నరీ ఏడీ రామాంజనేయనాయక్ సూచనలు


ఎండతీవ్రతను తట్టుకోలేక నీళ్లల్లో ఉన్న పశువులు

జూపాడుబంగ్లా: వేసవి ఎండల తీవ్రతకు మనుషులే కాదు..నోరులేని పశుపక్షాదులు సైతం అల్లాడిపోవటంతో పాటు వడదెబ్బకు గురవుతాయన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పశువులు మృత్యువాతపడే అవకాశాలున్నాయని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయ నాయక్ హెచ్చరిస్తున్నారు. మే నెలలో ఎండలతీవ్రత పెరిగే అవకాశం ఉందని, పశువులు అస్వస్థతకు లోనుకాకుండా కాపాడుకోవాలని సూచించారు.

నియోజకవర్గంలో 60,725 జీవాలు

నందికొట్కూరు నియోజకవర్గం లోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, మిడుతూరు, కొత్తపల్లి మండలాల్లో 60,725 ఆవులు, బర్రెలున్నాయి. వాటిల్లో ఆవులు 22,380లు, బర్రెలు 38,345 ఉన్నాయి. వాటిల్లో ఇప్పటిదాకా 15 పశువులకు వడదెబ్బసోకగా వాటికి ప్రథమ చికిత్సలతో పాటు పశుసంవర్ధకశాఖ వైద్యులు చికిత్సలు నిర్వహించడంతో కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు.

ఉదయం సాయంత్రం వేళల్లోనే మేపాలి

ఆవులతో పోల్చితే గేదెలు అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేవు. దేశవాళి ఆవుల్లో అధికంగా స్వేద గ్రంథులుండటం వల్ల అధిక ఉష్ణోగ్రతను తట్టుకోగలుగుతాయి. ఆవులు, గెదెలు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 5 నుంచి 10 గంటల్లోగా, సాయంత్రం 5 నుంచి 7 గంటల్లోగా మాత్రమే బయటకు తీసుకెళ్లి మేపాలి. వీలైనంత వరకు ఎండల తీవ్రత తగ్గేవరకు పాకలోనే బర్రెలు, ఆవులను ఉంచి మేతవేయటం మంచిది. ఎండగాలుల నుంచి పశువులకు రక్షణగా పశువుల పాకచుట్టూ గోనెసంచులను వేలాడదీసి వాటిని నీటితో తడపటం వల్ల పశువుల పాకలో చల్లనివాతావరణం నెలకొంటుంది. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులను నీటితో తడపటం, కడగటం వల్ల వాటిలో ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు. వీలైనంత వరకు పచ్చిమేతను వేయటం వల్ల బర్రెల్లో ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉండి పాలదిగుబడి తగ్గకుండా ఉంటుంది. ఎండల తీవ్రత వల్ల పశువులు పశుగ్రాసం తినటం తగ్గించి అధికంగా నీటిని తాగుతూ ఉంటాయి. తద్వారా శరీరంలో పోషకాల శాతం తగ్గి నీరసించి పోవటంతో పాలదిగుబడి తగ్గే అవకాశాలున్నాయి. పాలదిగుబడి తగ్గకుండా దాణాలో నిత్యం 50గ్రాముల ఖనిజ లవణాల మిశ్రమాన్ని కలిపి పెట్టాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు ఇలా..

వడదెబ్బసోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత పెరగటంతో పాటు గుండె అధికంగా కొట్టుకోవటం వల్ల ఆయాసంతో పశువులు రొప్పుతూ ఉంటాయి. కొన్ని పశువుల చర్మం ఎండిపోయినట్లుగా కనిపించటంతో పాటు పారుకొంటుంటాయి. వడదెబ్బ తీవ్రత అధికంగా ఉన్న పశువులు కిందపడి దొర్లటంతో పాటు గిల గిలా కొట్టుకొని స్పృహకోల్పోతాయి.

వడదెబ్బ తగిలిన పశువులకు చేయాల్సిన చికిత్స

వడదెబ్బతగిన పశువులను నీడకు చేర్చాలి. పశువులకు గాలిబాగా తగిలేటట్లు చేయాలి. వాటి శరీరాన్ని నీటితో తడపాలి. శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉంటే గోనెసంచులను తడిపి పశువుల శరీరంపై ఉంచాలి. చల్లనినీటిని అధికంగా తాగించాలి. వడదెబ్బ నుంచి పశువులు త్వరగా కోలుకోలేకపోతే వెంటనే పశువుల డాక్టరును సంప్రదించి వాటికి చికిత్సలు చేయించాలి.

నందికొట్కూరు నియోజకవర్గంలో ఆవులు, బర్రెల వివరాలు		
మండలం పేరు	ఆవులు	బర్రెలు
జూపాడుబంగ్లా	3,091	5,954
నందికొట్కూరు	4,390	5,069
పగిడ్యాల	2,659	4,526
మిడుతూరు	3,708	5,930
పాములపాడు	3,577	8,484
కొత్తపల్లి	4,955	8,382
మొత్తం	22,380	38,345

వడదెబ్బను నిర్లక్ష్యం చేయరాదు



వడదెబ్బసోకిన పశువులను నిర్లక్ష్యం చేయకుండా వాటికి వెంటనే ప్రథమ చికిత్స చేయటంతో పాటు పశువుల వైద్యులతో మెరుగైన వైద్యం చేయించాలి. లేకపోతే ప్రాణాపాయం సంభవించే అవకాశాలున్నాయి. వేసవిలో ఆవులు, బర్రెలు పశుగ్రాసం తినటం తగ్గించి అధికంగా నీటిని తాగుతాయి. ఎండల తీవ్రత తగ్గేవరకు పశువులకు ఉదయం వేలల్లో పచ్చిగడ్డిని దాణగా వేసి, రాత్రివేళల్లో ఎండుగడ్డిని వేసుకోవటం వల్ల పాలదిగుబడి తగ్గకుండా ఉంటుంది.

– రామాంజనేయనాయక్, ఏడీ, జూపాడుబంగ్లా

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జూపాడుబంగ్లా: ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఏడాదుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, కస్తూర్బా ఎస్‌ఓ యశోద తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా పాఠ్యాంశాల్లో తీర్చిదిద్దుతామన్నారు. ఆయా పాఠశాలల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు రూ.510ల పరీక్షా ఫీజును రెండు రోజుల్లోగా చెల్లించాలని సూచించారు.

సెలవుల్లో నాడు-నేడు పనులు పూర్తి చేయించాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వ పాఠశాలల్లో రెండో విడత మనబడి నాడు-నేడు పనులను వేసవి సెలవుల్లో పూర్తిచేయించుకోవాలని ఎంఈఓ మోహన్ పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మే 1 నుంచి జూన్ 11 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులిచ్చినట్లు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. సెలవుదినాల్లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలను నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వాటి గుర్తింపును రెన్యువల్ చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి


వెలుగోడులో అమ్మవారు


మహానందిలో కలశజలాలను తీసుకొస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పురోహితులు నరసరామ శర్మ, కిషోర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం ఉదయం నుంచి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. జంటలతో మూలవిరాట్‌కు సామూహిక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. కన్యలకు మహిళలు తాంబూలాలు ఇచ్చారు. సాయంత్రం అమ్మ వారికి ఊయల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు లాలం సుధాకర్, జూటూరు నాగపుల్లయ్య, మాలేపాటి శ్రీనివాసులు, శ్రీరామ్ నాగేశ్వరరావు, లాలం రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకం, విష్ణుసహస్రనామం తదితర విశేషపూజలను ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ భూమా కృష్ణమోహన్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం వెంకటేశ్వర్లు, గుంతా సూర్యనారాయణ శ్రేష్టి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు

నందికొట్కూరు: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయం నుంచి పవిత్రమైన గంగా కలశాలతో గ్రామపురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 102 గోత్రాల ఉత్సరణ, గోత్ర నామోచ్చరణ కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

మహానంది: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జయంతి సందర్భంగా మహానందిలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానంది మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నిత్యాన్నసత్రంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళలు మహానందిలోని రుద్రగుండం కోనేరులో కలశాలతో గంగాజలాన్ని తీసుకెళ్లి గరుడనంది ఆలయంలో అభిషేక పూజలు చేపట్టారు.

ఆత్మకూరు: పట్టణంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం ఆర్యవైశ్యులు,పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక అలంకరణ, హోమాలుని ర్వహించారు. మహిళలు తలపై కలశాలు ఉంచుకుని కలశపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహమూర్తిని అందంగా అలంకరించిన ఊరేగింపు నిర్వహించారు.

ఎస్టీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం వాల్మీకి సంఘం నియోజకవర్గ కన్వీనర్లు, మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. నాయకులు లాలుస్వామి, నారాయణ, మదనగోపాల్, నాగేశ్వరరావు, గజ్జెలన్న, రాముడు, అచ్చెన్న పాల్గొన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో వివిధ విభాగాలకు సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాదికి గాను దేవస్థానంలో పడితరము స్టోరుకు, పూజా సరుకుల సరఫరాకు, ఆహ్వాన పత్రికలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు, రశీదు పుస్తకాల ముద్రణకు ఈ నెల 15వ తేదీ లోపు దేవస్థానం కార్యాలయంలో కొటేషన్లు సమర్పించాలన్నారు.

వేడుకగా పద్మావతి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కళ్యాణ మండపంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీ పద్మావతి శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కొట్టె కృష్ణమూర్తి, చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, నరసింహారావు, నాగలీల, సరిత, శ్యాంసుందర్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి దుక్కులు


పోతులపాడు గ్రామంలో కాడెద్దులతో పొలంలో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, పోతులపాడు, 80బన్నూరు, తర్తూరు, మండ్లెం, తూడిచెర్ల, తరిగోపుల తదితర గ్రామాల్లోని రైతులు వేసవిదుక్కులను ప్రారంభించారు. రెండు రోజుల క్రితం భారీవర్షాలు కురవడంతో పొలాలు పదునెక్కాయి. దీంతో రైతులు కాడెద్దులు, కాంట్రాక్టర్ల సహాయంతో పొలాల్లో వేసవిదుక్కులు చేస్తున్నారు. ఇలాగే వర్షాలు కురిస్తే మే నెలాఖరు, జూన్ మొదటి వారంలోగా ఖరీఫ్ పంటలను సాగుచేసే అవకాశాలున్నాయని అన్నదాతలు పేర్కొంటున్నారు. గతేడాది ఖరీఫ్, రబీ పంటల దిగుబడి తగ్గినప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల కాస్త ఊరటచెందారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసి పంటల దిగుబడి ఆశాజనంగా రావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా రాగులు, జొన్నలు

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌దుకాణాల్లో ఉచితంగా అందిస్తున్న రాగులు, జొన్నలను రేషన్ కార్డు దారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యానికి బదులు మూడుకిలోల రాగులు, కిలో జొన్నలు రేషన్‌దుకాణాల్లో పొందవచ్చన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వేసవిలో రాగులు, జొన్నలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి కర్నూలు జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసినట్లు వెల్లడించారు. మే 1 నుంచి 17తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

మిడుతూరు: స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జలకనూరు గ్రామానికి చెందిన బాలన్న, రవణమ్మ దంపతులు నందికొట్కూరు వెళ్లి స్వగ్రామానికి ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. బాలన్నకు తీవ్ర గాయాలుకాగా, రవణమ్మ స్వల్పంగా గాయపడింది. ఇరువురిని 108లో చికిత్స నిమిత్తం నందికొట్కూరుకు తరలించారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మిడుతూరు: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఏబీఎం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి గల జట్లు ఎంట్రీఫీజు రూ. 800 చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 63043 50817, 99637 12068, 91545 46544 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు బైరాపురం నూర్ సోదరులు ఇటీవల అస్వస్థతకు గురై మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుని, ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సంక్షేమ పథకాలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, కో ఆప్షన్‌సభ్యులు రషీద్, కౌన్సిలర్ విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవాలయ పునఃప్రతిష్ఠ వేడుకలు



పగిడ్యాల: మండలంలోని సంకిరేణిపల్లె గ్రామంలో రేపటి నుంచి సుంకులమ్మ దేవాలయ పునఃప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం కానున్నాయి. మే 2 నుంచి 5వ తేది వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు పురోహితులు బ్రహ్మరుద్రయ్య తెలిపారు. 5న సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శనకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

'గడప గడపకు' విజయవంతం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో 4 రోజులు పాటు వరుసగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్ మీర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. కార్యక్రమం విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి

మిడుతూరు: శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నందికొట్కూరు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. ఆదివారం మండలపరిధిలోని నాగలూటి గ్రామంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలు పెంచుదించుకోవడంతో పాటు శాకాహారం అలవర్చుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన


స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివార్లను ప్రత్యేకంగా పట్టువస్త్రాలతో అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, బన్నూరు సర్వోత్తమ రెడ్డి, కాతా విష్ణువర్ధన్‌రెడ్డి, వాల్మీకీ సోదరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శ్రీశైలం ప్రాజెక్టుకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలకు దాతలు చీరలు పంపిణీ చేశారు.

మహానందిలో సండే సందడి


మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం మహామంగళహారతుల సమయం నుంచి ప్రారంభమైన దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులు సందర్శించారు. భక్తులరద్దీ దృష్ట్యా ప్రతి శని, ఆది, సోమవారాల్లో నిరంతర దర్శనం ఏర్పాటు చేసినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

సనాతన ధర్మాన్ని అలవరచుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థి దశ నుంచే భారతీయ సనాతన ధర్మాన్ని అలవరచుకోవాలని శ్రీ రామకృష్ణానందగిరి శిష్యులైన ప్రేమానందస్వామి, జయదేవానందగిరి స్వాములు పేర్కొన్నారు. ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా బాలవికాస్ కేంద్ర పాఠశాల వార్షికోత్సవ వేడకలు స్థానిక జంబులాపరమేశ్వరి దేవస్థానం కళ్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బత్తలూరు, బెలుంశింగవరం, చెర్వుపల్లె, భూపనపాడు, ఎల్లావత్తుల, పెట్నికోట, నందిపాడు, భ్రమరాంబికా గూడెం తదితర గ్రామాలకు చెందిన బాలవికాస్ కేంద్రాల విద్యార్థులు,తల్లిదండ్రులు, నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, వాసు, సత్యంరెడ్డి, రవీంద్రకుమార్, ఇందిరాదేవి పాల్గొన్నారు.

రైతన్న గుండెల్లో గుబులు


శ్రీనగరంవద్ద వర్షం భయంతో మొక్కజొన్న దిగుబడిపై పట్టలు కప్పుతున్న రైతులు

మహానంది: వడగండ్ల వానొచ్చింది... చల్లటి గాలొస్తుందంటూ కొందరు ఆనందపడతుండగా.. ఆరుగాలం కష్టించి పంటను పండించిన రైతన్నలకు మాత్రం ఆకాశంలో మబ్బులొస్తే చాలు గుండె గుబేల్‌మంటున్నాయి. ఇటీవల వీస్తున్న భారీ గాలులు, అకాల వర్షాలతో పొలాల్లో ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాలు ఎక్కడ తడిచిపోతాయేమోనని కంటికి కునుకులేకుండా కాపాడుకుంటున్నారు. కాస్త మొ బ్బులు కనిపిస్తే చాలు ధాన్యంపై పట్టలు కప్పేస్తున్నారు.


ప్లాస్టిక్ పట్టలు కప్పి రాళ్లు పెట్టిన దృశ్యం